వర్షించని మేఘం

సత్యవాడ ఇందిరాదేవి

రూమ్ నెంబరు సిక్స్టీ సెవెన్‌లో ఇన్విజిలేషన్ చేస్తున్నారు శ్యామలా, రామారావూ.

హాలంతా కలయ దిరిగి ప్రతివిద్యార్థినీ పరిశీలనగా చూసి వచ్చి కుర్చీలో కూర్చుంది శ్యామల—గుమ్మం దగ్గర నుంచుని హాలంతా పర్యవేక్షిస్తున్నాడు రామారావు.

మొట్ట మొదటి బెంచీలో లేత నీలం రంగు చీర కట్టుకుని పరీక్ష రాస్తున్న అమ్మాయి శ్యామల దృష్టిని ఆకట్టుకుంది. ఆ పిల్ల నాజూగ్గా, కొంచెం నీరసంగా కనిపిస్తున్నది. 'ఆడపిల్లలు మరీనూ—పరీక్షలముందు తెగచదివి ఇలా తయారౌతారు,' అనుకుంటూ, తను చదువుకునే రోజులు గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకున్నది శ్యామల.

ఆపిల్ల మెళ్లో నల్లపూసలూ, కాళ్ళకు మట్టెలూ వున్నై. "ఓహో అయ్యగారు చదువుకో మొస్తున్నారు! ఇంకేం మెట్రిక్ పరీక్షకు వచ్చింది" అనుకుంది శ్యామల.

అంతలో అమ్మాయి టేబిల్ మీదికి ఒరిగిపోయింది. 'అరెరె' అంటూ ఒక్క ఉదుటున ఆమెను సమీపించారు శ్యామలా, రామారావూ. కూజాలోంచి నీళ్లు వంపుకుని వెళ్ళి ఆమె మొహంమీద చల్లి సేద తీర్చింది శ్యామల.

"నే నిక్కడుంటాన్లెండి. మీరు ఆమెను లేడీస్ వెయిటింగ్ రూముకి తీసుకెళ్ళి కాస్త కాఫీ అదీ ఏమన్నా ఇప్పించండి" అన్నాడు రామారావు.

నెమ్మదిగా ఆ పిల్లను వెయిటింగ్ రూముకు నడిపించుకుని వెళ్ళింది శ్యామల. కాస్సేపటికిగాని మాట్లాడలేక పోయిందా పిల్ల.

"రాత్రి అన్నం తిన్నావా అమ్మా? పోనీ పొద్దునే టిఫిన్? ఏదీ తినలేదు గమో? ఆ మొహమె చెప్తోందిలే. ఖాళీ కడుపుతో పరీక్ష రాయటానికి వచ్చావా? మంచి దానివే" అంటూ ప్యూన్‌చేత కాఫీ టిఫిన్ తెప్పించి పెట్టించింది శ్యామల.

"వద్దండీ. నాకేం వద్దు" అంటూ [illegible] మెలికలు తిరిగిందా పిల్ల.

కానీ శ్యామలముందు అలాంటి మొహ మాటాలేం పనికిరావు. తినేవరకూ ఊరుకోలేదు—వెంటనే పరీక్ష హాలుకి తీసుకు వెళ్ళింది మళ్లీ.

"మీ మేలు మర్చిపోలేను. నాకు యెంతో సాయం చేశారు. దిక్కూ మొక్కూ లేని ఈవూళ్లో స్వంత అక్కలా ఆదుకున్నారు" అంటూ రెండు చేతులూ యెత్తి దణ్ణం పెట్టింది ఆపిల్ల పరీక్ష పూర్తవగానే.

"ఇవాళ లేచిన వేళమంచిది. అయితే- అయాచితంగా ఒక చక్కని చెల్లెలు దొరికింది. ఇంతకూ నీపేరేమిటమ్మా?" అని అడిగింది శ్యామల నవ్వుతూ.

"కామేశ్వరి" అన్నదా పిల్ల.

"బావుంది. నాపేరు శ్యామల. నువ్విప్పుడు మాఇంటికి రావాలమ్మాయి! అమ్మకు చూపించాలి నిన్ను" అంటూ ఆపిల్ల మాటకు అవకాశమివ్వకుండా రిక్షా బేరమాడేసింది శ్యామల.

రిక్షాలో ఒకరి విషయాలు మరొకరు తెలుసుకున్నారు. శ్యామల మధ్య తరగతి అమ్మాయి. కష్టపడి చదువుకుని బి. ఏ. పాసై, కాలేజీలోట్యూటరుగా ఉద్యోగం చేస్తున్నది. ఇంటికి తనేపెద్దది. మిగతా పిల్లలెవరూ తండ్రి చేతికి అందిరాలేదు. అంతా చదువుకుంటున్నారు. నెల జీతం చాలక కటకట లాడే ఆకుటుంబానికి శ్యామల ఉద్యోగం గొప్పరిలీఫ్ ఇచ్చిందనే చెప్పాలి.

కామేశ్వరీ వాళ్ళది దగ్గిరలోనే రాంపాలెమని ఒక పల్లెటూరు. ఏదో కొంత తినా గుడవా వున్నవాళ్ళే. అయిదారెకరాల మాగాణివుంది. వాళ్ళకక్కడ పాడీపంటా స్వంత ఇల్లూ వున్నాయి. కామేశ్వరి తర్వాత ఇద్దరే పిల్లలు. వయసులో రెండు మూడేళ్ల తేడావుంటుంది శ్యామలకీ కామేశ్వరికీ.

"మీ వారు ఏ వూళ్ళోవుంటారు? చదువా? ఉద్యోగమా?" అని అడగనే అడిగింది శ్యామల.

"ఉ—ఉద్యోగం చేస్తున్నారు కలకత్తాలో' అంటూ చటుక్కున తల వంచేసుకున్నది కామేశ్వరి.

"ఓహో—ఎంత సిగ్గు!" అని నవ్వుకున్నది శ్యామల.

ఆ రోజు బలవంతం చేసి తమ ఇంట్లోనే వుంచేసింది కామేశ్వరిని. ఎందుకోగాని ఆ పిల్ల అంటే అమితమైన ఇష్టం ఏర్పడిపోయిందామెకి.

చదువుకుని ఉద్యోగం చేస్తున్నా గర్వం, ఆడంబరం, అహంభావంవంటి గుణాలేమీ లేకుండా గలగలా నవ్వుతూ, నవ్విస్తూ, నిష్కల్మషంగా వుండే శ్యామల కామేశ్వరి మనసులో హత్తుకు పోయింది.

ఆ స్నేహం బలపడి, వారానికొక ఉత్తరం రాసుకోకపోతే తోచని స్థితికి వచ్చారిద్దరూ.

కామేశ్వరి మెట్రిక్ పాసైంది.

ఆసందర్భంలో శ్యామల రాంపాలెం

కూడా వెళ్ళి ఎంజాయ్‌చేసి వచ్చింది. కామేశ్వరితో, ఆమె కుటుంబంతో—ఆ పల్లెటూరును దృష్టిలో పెట్టుకుని, కష్టపడి ఒక చిన్న కథ రాసి కాలేజీ మాగజైనుకి ఇచ్చింది కూడాను.

మెట్రిక్‌తో చదువు ఆపేద్దామనుకున్న కామేశ్వరి, శ్యామల ప్రోత్సాహంతో పియూసీ పరీక్షకు కూడా కట్టింది.

తన సెబ్జెక్ట్‌లో కొన్ని ఎస్సేలురాసి, ఇతర లెక్చరర్ల దగ్గర్నించీ మరికొన్ని ఎస్సేలు సంపాదించి పంపించింది శ్యామల—"ఈ సారి పరీక్షలకు వచ్చినప్పుడు మా ఇంట్లోనే వుండాలి" అని షరతు ఒకటి పెట్టింది పైగా.

కామేశ్వరి తండ్రి ఆమెను తీసుకు వచ్చి శ్యామలా వాళ్ళింట్లో దిగవిడిచి వెళ్ళేడు. శ్యామల తండ్రితో మాట్లాడాడు. ఇరు కుటుంబాలకూ బంధుత్వం వున్నదన్న సంగతి ఒకటి బయట పడింది అయనరావడంవల్ల.

శ్యామల పర్యవేక్షణలో పరీక్షలు తృప్తికరంగా రాసింది కామేశ్వరి.

ఆ మర్నాడు కామేశ్వరిని తీసుకుని శ్యామలా ఆమె చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ సినిమాకు వెళ్ళారు.

వచ్చిడాబా మీద అమ్మ పరిచి వుంచిన పక్కల మీద వాలారు. 'రామారావు బావున్నాడురా' అంటే 'రాజనాలయాక్షణ బావుందిరా' అనుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ నిద్ర పోయారు పిల్లలు.

తెల్లవారితే కామేశ్వరి రాంపాలెం వెళ్ళి పోతుంది.

"కామూ! నేనొక కథ చెప్తాను వింటావా?" అని అడిగింది శ్యామల.

ఓ-వెయ్యి కథలు చెప్పినా వింటా. కథలంటే నాకు చచ్చేంత ఇష్టం" ఉత్సాహంగా అన్నది కామేశ్వరి.

చిన్నగా నిట్టూర్చి మొదలు పెట్టింది శ్యామల. "అనగా అనగా ఒకమధ్యతరగతి కుటుంబం-రివాజు ప్రకారం అందులో ఇద్దరు ముగ్గురు పెళ్ళి కెదిగిన ఆడపిల్లలు. పెద్దపిల్ల తల్లిదండ్రులకు బరువుగా, గుండెల మీద కుంపటిలా బతుకుతున్నది. ఉద్యోగం చేస్తున్నదనుకో అయినా ఆడబ్బు ఏమీ మిగలదు. 'తర్వాత ఈ పిల్ల బతుకేంగావాలి?' అని తల్లి దండ్రులు ఒకటే మధన పడుతున్నారు. కట్నం గుమ్మరించందే ఆడపిల్ల పెళ్ళి ఎట్లా అవుతుంది చెప్పు ఈరోజుల్లో.

ఈ పరిస్థితుల్లో, తనేం చెయ్యాలో తెలియక, తండ్రి యాతన చూడలేక ఆపిల్ల......"

ఆపేసి గుటక వేసింది శ్యామల.

"ఆపిల్ల? ఏం చేసిందక్కా? ఏం చేసింది? ఏ ఆత్మహత్యేనా....చేసుకోబోలేదుగద—" ఆదుర్దాగా అడిగింది కామేశ్వరి. "లేదు చెల్లాయ్! ఆత్మహత్యకు సాహసించలేదు. కానీ ఆత్మహత్యా సదృశ్యమైన పని చేసిందమ్మా" బరువుగా వుంది శ్యామల కంఠం.

ఎమిటక్కా అది? త్వరగా చెప్పు-ప్లీజ్ అంటూ ఆత్రంగా ఆమె చేతులు పట్టుకుంది కామేశ్వరి

'రెండో పెళ్ళివాడిని చేసుకోవటానికి నిశ్చయించుకుంది రెండో పెళ్ళంటే వయస్సు ముదిరినవాడని కాదు ముప్పై మూడు ఏళ్ళు వుంటాయి. అంతే మనిషి ఒక మోస్తరుగా వుంటాడు—కానీ.... కానీ....ఆగిపోయింది శ్యామల.

ఆమె కనుకొలకుల్లో నీళ్ళు.

"అక్కా...."

కామేశ్వరి చేతులు శ్యామల భుజాల చుట్టూ అల్లుకున్నాయి.

"ఏమిటి చెల్లాయ్! కంట నీరు పెడుతున్నావు? నీకేమమ్మా శుభమా అంటూ కాపరానికి పోబోతున్నావు! అప్పుడు చిలకా గోరింకల్లా నువ్వూ మీ వారూ.... ఎప్పుడైనా ఉండబట్టలేక నాబోటిది చూడటానికొస్తే 'ఎవరు నువ్వు?' అని అడుగుతావేమో కదూ?" అంటూ వాతావరణం సంతోషంగా మార్చడానికి ప్రయత్నించింది శ్యామల.

"అక్కా! అక్కా!" అంటూ ఏదో చెప్పాలని ప్రయత్నించి—చెప్పలేక అల్లాడిపోయి—శ్యామల భుజంమీద వాలి బావురుమన్నది కామేశ్వరి.

"ఏమైందమ్మా! అరె—నన్ను మర్చిపోతా నన్నాననా ఏడుస్తున్నావు? అనసులే పొరపాటైపోయింది. నాకు తెలుసులే, నువ్వు ఎన్నెప్పుడూ మర్చిపోవని. ఛీ—ఇంక ఊరుకోవాలి మరి' అంటూ కళ్ళు తుడిచి ఓదార్చింది శ్యామల అంతేగాని కామేశ్వరి దుఃఖానికి కారణం తెలుసుకోలేకపోయింది

కాసేపు నిశ్శబ్దంగా వున్నాక—

"ఇంత చదువుకున్నదానివి ఈ పెళ్ళికి నువ్వెందుకు ఒప్పుకున్నావు? నీ తెలివంతా ఏమైంది?" అని అడిగింది కామేశ్వరి.

"గత్యంతరం లేక—రెండు మూడు సంబంధాలు చూశారు నాన్న ఆ మధ్య. అధమపక్షం అయిదువేలైనా కట్నమిచ్చి, ఆడబడుచు లాంఛనాలిచ్చి వెండి కంచం, వెండి చెంబు, పట్టుబట్టలూ—అయినా ఇవ్వాలన్నారు. అంతా కలిపి పదివేలవుతుంది. ఇదిగాక పెళ్లి ఖర్చు, నాన్న ఎక్కడ్ణించి తెస్తారు? మిగతా పిల్లల గతేమిటి?

పైగా చిత్రమేమిటో తెలుసా? ఆ వరమహాశయులు కనీసం గ్రాడ్యుయేట్లు కూడా కాదు—కట్నంమటుకు కావాలి. పిల్ల మంచితనం, తన సౌశీల్య ప్రాభవం చేత ఇరువంశాలూ వెలిగించగల నేర్పు—అక్ఖర్లేదు. డబ్బువస్తే చాలు. వాళ్ళ ఒంట్లో రక్తమాంసాలూ, వాళ్ళ మనస్సులో లజ్జాభిమానాలూ—మృగ్యమేమో మరి.

పోన్లే, వాళ్ళ గొడవెందుకు గాని ఇతనికి కానీ కట్నంకూడా అక్ఖర్లేదు. ఈ మాట నా చెవుల్లో అమృతం పోసినట్లయింది. వెనకా ముందూ ఆలోచించాలన్పించలేదు. ఆలోచించినా ప్రయోజన

మేమిటిలే.

నువ్వింందాక ఏమన్నావు కామేశ్వరీ! చదువుకుని ఉద్యోగంచేసే పిల్లవి. ఇలాంటి పెళ్ళికి ఎందుకు ఒప్పుకున్నానని కదూ. ఇప్పుడు తెలీదులే నీకు. ఉద్యోగం చేస్తున్నదాన్ని కనకనే ఒప్పుకున్నాను. స్వతంత్రంగా బ్రతకగల నేనే ఈ సాహసం చెయ్యకపోతే. ఇంకొకళ్ళకి ప్రమాదం వస్తుంది అనవసరంగా— అలా ఆశ్చర్యపోకమ్మాయి! తర్వాత తెలుస్తుందిగా. కాస్త సస్పెన్స్ను ఎంజాయ్ చెయ్యి.

ఒక్కమాట కామేశ్వరీ! సుఖంకోసం ఆశపడి నే నీ పెళ్ళి చేసుకోవటల్లేదు. ఈ కర్తవ్యపాలన, ఈ అసిధారావ్రతం నాకు తప్పవు....'' అన్నది శ్యామల తీవ్ర భావావేశంతో.

''నాకు మతిపోతున్నదక్కా! నువ్వు తొందరపడి ఒక నిర్ణయానికి రావనే నమ్మకం నాకున్నది. అయినా ఎందుకో భయంగా గందరగోళంగా వుంది. కోపం తెచ్చుకోనంటే నేనొక మాట చెప్తాను వింటావా?'' అని అడిగింది కామేశ్వరి.

''చెప్పు.''

''మా నాన్న మీకు డబ్బు సాయం చేస్తారేమో అనుక్కుంటాను. పోనీ అప్పుగానే అనుకో. అన్నివిధాలా నీకు ఇష్టమైన పెళ్ళికొడుకును చూసి చేసుకుంటే సరి—

నవ్వి, ''ప్చ్ ఇలాంటి ఆలోచనలేం లాభంలేదు కామేశ్వరీ. నేను పూర్వజన్మ కర్మనూ, భగవంతుణ్ణికూడా నమ్ముతాను. దేవుడు దేన్ని ప్రసాదిస్తే అదే నాకు చాలు—అన్నట్లు పెళ్ళి రహస్యంగా జరగాలిట, ఎవర్నీ, చివరికి నిన్నుకూడా పిలవటానికి వీల్లేదు'' అంటూ దిండులో

తలదూర్చింది శ్యామల

* *

పెట్టెముందు కూర్చుని బట్టలు సర్దుతున్నది శ్యామల. గబుక్కున భుజాల చుట్టూ చేతులు పడేటప్పటికి ఉలికిపాటుతో కెవ్వుమంది.

"అబ్బ! ఎంత ఖంగారో? నేనేలే" అన్నాడు ప్రతాప్ ఆమెకింకా దగ్గిరగా జరిగి నవ్వుతూ.

"ఓహ్! మీరేనా? యూదాలాపంగా వున్నా కదూ? ఉలిక్కిపడ్డాను" అంటూ దూరంగా జరిగికూచుంది శ్యామల.

అతని నొసలు ముడిపడ్డాయి.

"ఏమిటి శ్యామా! నీ ముఖావం అసలు? పెళ్ళైనప్పట్నించీ నన్ను తప్పించుకునే తిరుగుతున్నావ్" అని అడిగాడు.

"నేనా? ఛ—ఈ దేశ ధర్మం ప్రకారం నాకు మీరు పూజ్యులు—నా ఇహ లోకానికీ పరలోకానికీ కూడా మీరే గదా ఆధారం—" అన్నదామె నవ్వుతూనే.

ఆ నవ్వు వెనక కసి, క్రోధం, పగ, అసహ్యం దాగివున్నాయని అతనికి తెలియలేదు. సరికదా "నువ్వు చాలా బాగా నవ్వుతావ్ శ్యామా! నీ పెదవులు చాలాచాలా బావుంటై—ఎంత బావుంటయ్యో చెప్పనా?" అంటూ మళ్ళీ దగ్గిరగా జరిగా డతను.

"చెప్తురుగాని తొందరపడకండి. పొయ్యిమీద కూర మాడిపోతున్నట్లుంది" అంటూ గబుక్కున లోపలికి పరిగెత్తింది శ్యామల.

ఆమె వెనకే వంటింట్లోకి వెళ్ళాడు ప్రతాప్, నిరుత్సాహాన్ని అణుచుకుంటూ.

"శ్యామా! వంట తొందరగా చేసెయ్—పిక్చర్‌కు పోదాం—ఇవాళ ఏం వంక చెప్పినా విన్పించుకోనమ్మాయ్. నువ్వే చెప్పు అసలు. కొత్తగా పెళ్ళైన భార్యాభర్తలు ఇలాగేనా వుండేది? ఒక సరదా, షికారూ ఏం అక్కర్లేదా? చదువుకున్న పిల్లవుకదా. అంత నిరుత్సాహం ఎందుకు నీకు? నీకంటే ముసలివాళ్ళు నయం. పెళ్ళికి ముందు నేనెన్ని కలలు కన్నానో తెలుసా నీ గురించి. మనిద్దరం రతీ మన్మథుల్లా వుందామనుకున్నాను. కానీ నువ్వో. ఒట్టి జడపదార్థానివి తయారైనావు! సరే—వంట అయిపోవచ్చింది కదా. చక్కగా—మంచి చీర కట్టుకొని తయారుకా. ఓ—మాటల్లో పడి చెప్పటం మర్చిపోయాను. "నీకివాళ ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం" అని అడిగాడు అతను హడావుడిగా.

"ఏమో—డబ్బుగల మారాజులు—ఏం తెచ్చినా తేగలరు" అన్నది శ్యామల నిర్లిప్తంగా.

"అదే—ఆ ఆముదం తాగిన మొహమే పెట్టొద్దన్నాను. చూడు ఈ చీర బావుందా? నీకు బావుంటుందన్పించికొన్నాను' అంటూ ఒక ప్యాకెట్ ఆమె చేతికిచ్చాడు ప్రతాప్.

లేత గులాబీరంగు చీర. అరచేతి

వెడల్పున పాలపిట్ట రంగు జరీఅంచుతో మెరిసిపోతున్నది.

స్త్రీ సహజమైన ఉత్సుకతతో ఆమె కళ్ళు మెరిసాయి క్షణకాలం. మళ్ళీ మామూలుగా అయిపోయింది. "ఇప్పుడింత ఖరీదుపెట్టి చీర దేనికి?" అన్నది నెమ్మదిగా. ఆమె గుండెలో ఒకసారి గర్వమూ మరోసారి దుఃఖమూ పోటీ పడుతున్నై.

నీరు గారినట్లయిపోయాడు ప్రతాప్. శ్యామల పద్ధతి అతనికి అర్థం కావడం లేదు. భర్త తనంతట తాను చీర తెస్తే భార్య అట్లాగేనా ప్రవర్తించేది? తన కెందులోనూ లోటు చెయ్యలేదే. ప్రాణంగా చూసుకుంటున్నాడే—కానీ ఎంత చేసినా ప్రయోజనం కన్పించటం లేదు శ్యామల నవవధువులా వుండట ల్లేదు. సరే కాలక్రమాన మారక పోతుందా? అని నెమ్మదిగా ఉత్సాహం తెచ్చుకున్నాడు.

"ఇప్పుడెందుకా? సినిమా కెళ్ళబోతున్నాం గనక. ఊఁ లే మరి తొందరగా ఈ చీర కట్టుకురా. టేబిల్ మీద పూలపొట్లం పెట్టాను. పెట్టుకో—అప్పుడెలా వుంటావో తెలుసా? బంగారు బొమ్మలాగ వుంటావు" అన్నాడు.

శ్యామలకు నవ్వొచ్చింది.

"ఇప్పుడు తోలుబొమ్మలా వున్నానన్నమాట. ఏ బొమ్మయితే నేమండీ—జీవం లేకపోయాక" అంటూ అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయింది.

నాలుగురోజుల తర్వాత.

చీరలూ, నగలూ, పువ్వులూ, స్వీట్స్ మొదలైన వేవి తెచ్చినా శ్యామలను సంతోషపెట్టటం జరగదని తెలుసుకున్న ప్రతాప్ కొత్తగా వెలువడిన రెండు మంచి పుస్తకాలు కొనుక్కువచ్చాడు.

చెక్కిట చెయ్యి చేర్చుకుని ఏదో ఆలోచిస్తున్నది భార్య. ఆమె మొహం చూస్తే ఎంతో అలసటగా వున్నట్లు తెలుస్తున్నది.

నెమ్మదిగా వచ్చి, ఆమె మొహాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నుదురు ముద్దుపెట్టుకుని "ఎందుకు శ్యామా! అలా వున్నావ్—నాకు చెప్పవా? ఎంతసేపూ మన సంసారం గురించి నా తాపత్రయమే తప్ప నీకేమీ పట్ట దెందుకని? కాసేపు సరదాగా మనిద్దరం కబుర్లు చెప్పుకోవాలనీ, కష్టసుఖాలు మాట్లాడుకోవాలనీ అనిపించ దెందుచేత? నిన్ను సుఖపెట్టాలని ఎంత ఇదైపోతున్నానో తెలుసా? నీ మొహంలో చిరునవ్వు చూడాలని ఎంత ఎదురుచూస్తున్నానో తెలుసా?" అన్నాడు ప్రతాప్, బాధను అణుచుకుంటూ.

ఇంక ఉండబట్టలేకపోయింది శ్యామల. గబుక్కున అతని ఒళ్ళో తల వాల్చుకుంది. ఆమె కంటివెంట నీళ్ళుబికాయి.

"ఛ—ఛ—నే నేమన్నానని అంత బాధపడుతున్నావ్ శ్యామా!" అంటూ

ఆప్యాయంగా ఆమె ముంగురులు సవరించాడతను

"మీ రన్నందుకు కాదండీ

కళ్లు తుడుచుకుంటూ అని అక్కణ్ణించి వెళ్లిపోయింది శ్యామల.

ప్రతాప్ నిట్టూర్చి విసుగ్గా బయటికి నడిచాడు.

ఆరాత్రి అన్నాలదగ్గిర—

"ఇదేమిటి పచ్చడి వదిలేశావేం? అదేమి అన్నంతినట మసలు. ఇంకొస్త కూర తిను. ఇంత సాఖాగ్గా తింటావు గనకనే అంత సన్నగా వున్నావు. ఇహనించి ఈ పద్ధతేం కుదరదమ్మాయ్. నేను చెప్పినట్టు వినాల్సిందే" అంటూ గంభీరత నటిస్తూ భార్యకు మరింత వడ్డించేశాడు ప్రతాప్.

అతని చిలిపితనానికి చిన్నగా నవ్వింది శ్యామల.

"వినకపోతే ఏం చేస్తారు?" అని నెమ్మదిగా అడిగింది.

"ఏం చేస్తానా? ఓయ్ అమ్మడూ! నేను నీ మొగుణ్ణి. తలుచుకుంటే ఏమన్నా చెయ్యగలను" చాలా సీరియస్ పోజు ఎరువు తెచ్చుకున్నాడతను.

"అవును—నిజమే. నన్ను వదిలేసి మరొకర్ని చేసుకోనుకూడా చేసుకోగలరు. అలా భార్యలను వదిలేయటం తమరికి నల్లేరుమీద బండినడకే నాయె" అన్నదామె.

దెబ్బతిన్నట్టు చూశాడు ప్రతాప్.

అంతలోనే తెలివి తెచ్చుకుని 'శ్యామా!' అన్నాడు ఆదుర్దాగా

'చెప్పండి—మీకు మీ మొదటిభార్య ఎందుచేత నచ్చలేదు? ఆవిడను ఎందుకు వదిలేశారు? అపారమైన మీ అనురాగాన్ని పొందే అదృష్టానికి ఆవిడెందుకు నోచుకోలేదు?" సూటిగా ప్రశ్నించింది.

అతని మొహం ధుమధుమలాడింది.

"ఇప్పుడదంతా ఎందుకు లెద్దూ. ఊఁ అన్నం తిను ముందు" అన్నాడు.

"కాదు. చెప్పాలి.'

"నాకు పదకొండో ఏట చేశారు పెళ్లి. తెలిసీ తెలియని వయస్సు—అయినా పెళ్లివద్దని గట్టిపట్టు పట్టాను. చివరికి ఏడ్చి గోలపెట్టాను. కానీ బలవంతాన పెళ్ళిచేశారు. ఆ క్షణంలోనే నేను ప్రతిజ్ఞ చేసుకున్నాను. మళ్లీ ఎప్పుడూ ఆ పిల్లతో ఆడుకోననీ—దాని మొహం ఇంక చూడననీ—చిన్నప్పట్నించీ నాకు పట్టుదల ఎక్కువ."

"అంత బలవంతాన ఎందుకు చేశారు మీకు పెళ్ళి?"

"ఆఁ ఎవరో ముసలావిడ చస్తోందిట. దగ్గిర సంబంధమే ఇది, మా పెళ్లి చూస్తేగాని ఆవిడ ప్రాణం పోదుట. నోట్లో వేలుపెట్టుకుని చీకుతూ కూర్చుంది పెళ్లిపీటలమీద ఆ పిల్ల. నాకు బాగా గుర్తు—ఛ-ఛ—నా కసహ్యం వేసింది. వాళ్ళ పంతం వాళ్ళు నెగ్గించుకుంటే నా పంతం నేను నెగ్గించుకున్నాను. పెళ్ళ

య్యాక ఆ వూరే వెళ్ళలేదు. ఆ పిల్లి మొహం మళ్లీ చూడలేదు.

"ఆ! మళ్ళీ ఆమెను చూడనేలేదా?" ఆశ్చర్యంగా అడిగింది శ్యామల.

"లేదు—నాకు చాలా చిన్నప్పట్నించీ చిత్రమైన ఊహలుండేవి. నేను పెద్ద వాడినై గొప్ప చదువులు చదవాలనీ, బాగా చదువుకున్న అమ్మాయిని ప్రేమించి, ఆదర్శవివాహం చేసుకోవాలని తపన పడే వాడిని. చివరికా పల్లెటూళ్ళో పడకొండేళ్ళన్నా నిండక ముందరే సొంత మేన మామ కూతుర్ని అర్జెంటుగా పెళ్లి చేసుకున్నాను పైగా అయిదురోజుల పెళ్ళి. నాకు ఎంత ఆఘాతం కల్గించిందో ఈ సంఘటన ఆలోచించుకో శ్యామా! నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు—కులభేదం లేదు. విధవావివాహం కాదు—ఆఖరికి యుక్తవయస్కులమైనా కాదు. ఏమిటోలే అదంతా జరిగిపోయిన గొడవ. ఇప్పుడా పీడకలను తల్చుకోవద్దు అసలు" అన్నాడతను ఉద్విగ్నచిత్తుడై.

"బావున్నై, మీ కారణాలు. ఒక ఆడపిల్ల జీవితం నాశనం చెయ్యటానికి ఇవి కారణాలా? ఇంతకూ ఆ పిల్ల ఇప్పుడు బాగా చదువుకున్నదేమో—మంచి సౌందర్యవతి అయిందేమో—నాకంటే ఆమే బావుందేమో ఒకవేళ. ప్చ—మీ దురదృష్టం — పోనీ ఫొటో అయినా చూశారా?" అని అడిగింది శ్యామల.

"లేదు—చూడలా కానీ ఏం చదువుకుని వుండదని గ్యారంటీగా చెప్పగలను. ఆ కుటుంబ మంతేలే — పరమ సనాతనం" అన్నాడు ప్రతాప్.

"ఏమైనా గానీ-ఆమెకూడా మనిషే-ఆమెదీ మనసే. అందరిలాగే ఆ ప్రాణికీ కోరికలుంటాయి. ప్చ్—మీ పట్టుదలకు ఆ అమాయకురాలి జీవితాన్ని బలిచేస్తారా? ఏమండీ—తనేం తప్పు చేసిందని ఈ శిక్ష? ఈ క్షోభ? పాపం" అన్నది శ్యామల ఆర్తితో.

"పోదూ—పల్లెటూరు మొద్దు—బాధ కూడా తెలుసేమిటి తనకి?" అన్నాడతను తేల్చి పారేస్తూ.

"పట్నవాసం వారికిగాని బాధ తెలియదన్నమాట. పల్లెటూరివాళ్ళంతా వట్టి గొడ్లు. ఏం?"

"అబ్బ! నన్ను మాట్లాడించకు. ప్లీజ్—దాని మాటలేం ఎత్తకు నా దగ్గర—" అంటూ వెళ్ళి పడుకున్నాడు ప్రతాప్.

"సరే—ఎత్తనుగానీ—ఆమె పేరు మటుకైనా చెప్పండి" అన్నది శ్యామల అతని వెనకే వెళ్ళి.

"ఎందుకు పేరు?" దుప్పటి తొలగించి, కళ్ళు చికిలించి అడిగాడు ప్రతాప్.

"ఉట్టినేనండీ — కుతూహలం!" అంటూ నవ్వింది శ్యామల.

"కామేశ్వరి గాబోలులే. ఇంకా నయం చాముండేశ్వరి అని పెట్టలేదు. మరీ ఘోరంగా వుండేది" అంటూ దుప్పటి ముసుగు పెట్టుకున్నాడు అతను మళ్ళీ.

ఒక్క-క్షణం ఆమె మెదడంతా మొద్దుబారిపోయింది. ఆమె మనస్సునిండా "కామేశ్వరి" అనే పేరు నిండిపోయింది.

"ఏమో ఏ కామేశ్వరో? తనేనని ఏమిటి?" అనుకుంటూ గబగబా లేచి పాత ఫోటోలన్నీ వెతికింది. కానీ ప్రతాప్ మొదటి పెళ్ళిఫొటో ఎక్కడా కన్పించలేదు.

మర్నాడంతా ఆలోచించింది.

ఆవిషయం తెలుసుకోవాలంటే ఒక్కటే ఉపాయం కన్పించింది. భర్త వచ్చేవేళ్టికి చక్కగా అలంకరించుకుని కూచుంది. మొహంలో ప్రసన్నతాదృష్టి. పెదవులపై కళవనే చిరునవ్వూ—అలరించింది. ఒక విధమైన ఉత్సాహంతో, ఒక విధమైన పట్టుదలతో—ఆమె తేలిపోతున్నది నేలమీద నిలవకుండా—

ఆఫీసునించి వచ్చిన భర్తకు ఆప్యాయంగా సేవచేసింది మనస్ఫూర్తిగా. ముగ్ధుడైపోయినాడతను. "ఏమి నా అదృష్టం. ఇన్నాళ్ళకి నా ఇల్లాలి మొహంలో ఇంత జీవకళ చూశాను" అన్నాడు ఆమె చెక్కిలి నొక్కుతూ—

చిన్నగానవ్వి "మీరు మరీనూ—" అన్నది పరవశించిపోతూ—శ్యామల

"నిజం- శ్యామా! ఇవాళ ఎలా వున్నావో తెలుసా? దేవకన్యలా వున్నావు ఎప్పుడూ నువ్వింత హుషారుగావుంటే ఎంత బావుంటుంది శ్యామా! నీ అందం నన్ను వివశుణ్ణి చేస్తున్నది. నీ హుషారు నన్ను నిలవనీయడంలేదు. ఉద్యోగం మానేసి ఇరవైనాలుగు గంటలూ అలా నిన్ను చూస్తూ కూచోవాలన్పిస్తున్నది" అన్నాడతను.

శ్యామల హృదయం జివ్వుమన్నది. అతని కౌగిట్లో ఒక్క-క్షణంపాటు మరే

విషయమూ గుర్తుకు రాలేదు. "ఇతడు నా భర్త. భర్తనించి ఇంత అనురాగాన్ని నోచుకున్నాను. ఓహో—నాకీ ఊహ చాలు. ఈ మధురస్మృతే నా భవిష్యజీవితానికి ఆలంబనం—" అనుకుంటూ పరవశమై పోయిందామె.

"చెప్పు శ్యామా! అస్తమానం నా దగ్గిరే వుండాలన్పించటం లేదా నీకు?" ఆశగా, లాలనగా అడిగాడు ప్రతాప్.

"ఎందుకన్పించదండీ! ఎంతగానో అనిపిస్తుంది. నే నొక్కదాన్నే నా భర్త అనురాగాన్ని అనుభవించాలని, ఇంకే స్త్రీ కూడా మనమధ్యకు రాకూడదని— కానీ...." భరించలేని ఆవేదనతో గిలగిల లాడి పోయిందామె—

"అర్థమైంది శ్యామా! నీ భయం. ఆమెవల్ల నీకే అపకారమూ జరగదు. నిశ్చింతగా వుండు. పిచ్చిపిల్లా! ఇందుకా ఇన్నాళ్ళూ నీబాధ." అన్నాడతను.

"ఎలా నిశ్చింతగా వుండనండీ. విడాకు లివ్వలేదు గదా మీ కుటుంబ గౌరవానికి భంగం కలుగుతుందని, చట్టరీత్యా నేరమనీ, మీ ఉద్యోగం పోతుందనీ నన్ను రహస్యంగా పెళ్ళిచేసుకున్నారాయెను. సకల బంధువుల సాక్షిగా మీరామె మెళ్ళో తాళికట్టారు. న్యాయానికి ఆమే మీభార్య—నేను కేవలం—కేవలం— ఉంపుడు........"

"ఛట్" అంటూ ఆమెనోరు మూసేశాడు ప్రతాప్.

"సాక్ష్యానికి బంధువులు లేకపోవచ్చు. కానీ నా మనస్సున్నది— పంచభూతాలున్నాయి నువ్వు ముమ్మాటికి నా భార్యవి. నువ్వే నాభార్యవి" ఆర్తితో నిశ్చయంతో అంటూ ఆమె చేతిలో చెయ్యి వేశాడు.

"కానీ....ఆవిడే మన పెళ్ళిసంగతి తెలిసి ఇక్కడికివచ్చి తనస్థానం—ఆక్రమించు కుంటానంటే....నాగతి?....నేను మాట్లాడకుండా తప్పుకోవలసిన దాన్నే గదా—" అన్నదామె—

"అక్ఖర్లేదు. నేను నీపక్షమే నంటున్నాగా- నాకిష్టం లేదంటూంటే బలవంతాన కాపరం చెయ్యమంటుందా? నీకు తెలీక భయపడి పోతున్నావుగాని—వాళ్ళకెవరికీకూడా అంతసాహసం లేదు. వుంటే మన పెళ్ళికి ముందే జాగ్రత్త పడేవాళ్ళు. ఎంత అమాయకురాలను కున్నావ్—అయినా ఎక్కడో కృష్ణా జిల్లాలో మారుమూలకు గ్రామమైన రాంపాలెంలో వున్న వాళ్ళకి కలకత్తాలో మనసంగతేం తెలుస్తుంది" అన్నాడతను.

దీర్ఘంగా నిశ్వసించింది శ్యామల. ఆమె గుండె ఆర్తితో మూలిగింది. ప్రేమతో కొట్టుకుంది.

"అనుకున్నంతా అయింది తను ఆక్రమించింది కామేశ్వరిస్థానాన్ని అన్నమాట ఆ అమాయకురాలి జీవితానికన్నమాట తను ఎసరు పెట్టింది." అని గిలగిలాడింది.

భర్త మీది ప్రేమ ఒక్కక్షణంపాటు ఆమెను ఊపిరాడనీయలేదు— అతన్ని

వదులుకోవటానికి ఆమె మనస్సూ, శరీరమూ ఏకమై ససేమిరా ఒప్పుకోవటం లేదు.

అతిప్రయత్నం మీద తనను తాను సంబాళించుకుని "అయినా పెళ్ళికి ముందే తెలుసునుగా—ఈ చెల్లి కాకపోతే ఇంకో చెల్లి. ఎవరైతేనేం అన్యాయానికి బలై పోతోంది. ఆ చెల్లిని కాపాడాలనేగదా ఈ పెళ్ళికి వప్పుకుంది. పెళ్ళిమీద మోజు కొద్దీ కాదాయె. కాకపోతే సంఘానికి తను వివాహితగా కనిపించాలి. మెళ్ళో మంగళసూత్రం ప్రీకి శ్రీరామరక్ష—వెళ్ళి మళ్ళీ ఉద్యోగంలో జాయిన్ కావాలి. జీవితంలో ఒక మంచి పని. ఏ ఆడదీ చెయ్యని త్యాగం—చేసిన తృప్తే చాలు శేష జీవితాన్ని గడపటానికి—ఇంతదూరం వచ్చి ఇప్పుడు వెనకాడ కూడదు. ఎలాగైనా సరే—కామేశ్వరి జీవితం కళకళలాడాలి. ఇందుకే గాబోలు పెళ్ళిసంగతి చెప్తుంటే ఆపిల్ల అలా ఏడ్చింది" అనుకుంది. దీర్ఘంగా నిశ్వసించింది.

ఆ మర్నాటి సాయంత్రం—

ప్రతాప్ వచ్చేటప్పటికి టేబిల్ముందు కూర్చుని ఏదో రాసుకుంటోంది శ్యామల.

మెల్లిగా వెళ్లి ఆమె కళ్లు మూసాడతను.

"మీరా? వచ్చేశారా అప్పుడే—చాలా పెందలాడి వచ్చారు గదూ—" అంటూ గాభరాగా విడిపించుకుని—రాస్తున్న కాయితం ఉండచుట్టేసి, జాకెట్లో దాచేసింది శ్యామల.

"ఏమిటది! ప్రేమలేఖా!" నవ్వుతూ అడిగాడు తను.

"ప్రె—ప్రేమలేఖ—మీకెలా తెలుసు" అంటూ గాభరాగా పెదవి కొరుక్కుని. గబగబా లోపలికి వెళ్లి ఆ కాయితం దాచేసి వచ్చిందామె. కానీ మామూలుగా వుండలేకపోతున్నట్లు కన్పించింది.

ఆరాత్రి ఆమె నిద్రపోయాక వెదికి వెదికి ఎలాగైతేనేం ఆమె పెట్లో చీరల మడతల్లో సంపాదించాడా కాయితాన్ని—ప్రతాప్.

కళ్ళు అగ్నికణాలు వర్షిస్తుండగా చదివాడు.

డియర్ రావ్!

ఈ మధ్య నీ దగ్గిర్నించి ఉత్తరాలు రాకపోతే ఖంగారుపడ్డాను. నువ్వు ఇంత ప్లాన్లో వున్నావని నాకేం తెలుసు మరి? నిన్న నీ ఉత్తరం ఎంతో సంతోషం కలిగించింది. వెంటనే చింపేశాన్లే—భయపడకు. నన్ను నీ దగ్గిరికి వచ్చెయ్యమంటావా? ఎంత శుభవార్త రాశావు? కానీ నాకు చాలా భయంగా వుంది ప్రతాప్ను తప్పించుకురావటం ఎట్లాగా అని—అయినా ఏదో వంక దొరక్కపోదులే—నీకోసం....తప్పు తప్పు మనకోసం ఈ మాత్రం సాహసం చెయ్యకపోతే ఎలాగా? మళ్లీ నీతో జీవితం—ఓహ్! ఎంత సంతో....ఉత్తరం సగంలోనే ఆగిపోయి వుంది.

పళ్ళు బిగబట్టాడు ప్రతాప్—

గబుక్కున వెళ్లి "ఇదేమిటి?" అని

అడిగారు శ్యామలను లేపి ఉత్తరంవైపూ అతనివైపూ మార్చిమార్చి చూపి "అదా ఉత్తరం" అన్నది శ్యామల జంకకుండా. ఆ ఉత్తరం భర్త చూడాలనే గదా ఆమె తాపత్రయం.

"ఎవడీ రావు?" అతని గర్జన.

"నా బాయ్ ఫ్రెండ్."

ఆమె చెంప ఛెళ్ళుమన్నది.

ఇంకేం మాట్లాడాలో తోచలేదతనికి—ఒక్క క్షణం అటూ ఇటూ పచారుచేశాడు.

"ఎంత మోసం—ముందు నా ఇంట్లోనించీ బయటికి నడు" అన్నాడు ఆగ్రహం పెల్లుబికి రాగా.

"ఇందులో మోసమేమిటి? కొన్ని కారణాలవల్ల నాకు మీరు నచ్చలేదు. సరి పోలేదా? అయినా ఎదురుగావున్నాను గనక నా సంగతి తెలిసింది మీకు. అక్కడ పల్లెటూళ్ళో తమరి ఇల్లాలు ఇలా ఎంతమందితో....

"నోర్ముయ్" మళ్లీ ఆమె చెంప ఛెళ్ళుమంది.

"ఆమె పేరెత్తటానికైనా అర్హత లేదు తెలుసా నీకు? నా బుద్ధి గడ్డి తిని.... నిన్ను తెచ్చి నెత్తికెక్కించుకున్నా గానీ. ముందు వెళ్లి కామేశ్వరిని తీసుకువస్తాను. అందకత్తె కాకపోయినా ఫరవాలేదు. నీ లాంటి పీచురాలవటుకు కాదు. సుగుణ వతి—శీలవతి. మా అమ్మకు కోడలే కాదు, మేనకోడలుకూడా. తనకి అన్నీ మా అమ్మ పోలికలే వచ్చాయని విన్నాను, నీ తళుకు బెళుకుల కిహ మోసపోను. ఇంక ఆలస్యం చెయ్యను. కామేశ్వరిని క్షమించమని అడుగుతాను" అన్నా డతను.

ఒక్క ఉదుటునవచ్చి అతని కాళ్ళను చుట్టుకున్నది శ్యామల. ఆమె శరీరం ఒణుకుతున్నది. కళ్ళు వర్షిస్తున్నాయి.

"మీకు తెలీదు. నేను మిమ్మల్నెంత ప్రేమిస్తున్నానో, మీరు చూసిన ఆ ఉత్తరం అబద్ధం. ఎలాగైనా సరే మీరు నన్ను విడిచిపెట్టి కామేశ్వరిని తీసుకొచ్చు కోవాలని అలా చేశాను. కానీ ఇప్పుడు నేనే మిమ్మల్ని విడవలేక పోతున్నానండీ—ఈ గుండెకోతను భరించలేకపోతున్నాను" అని మనస్సులోనే అగ్గగ్గలాడిందామె.

"ఏమండీ! మంచిపని చేస్తున్నారు. నన్ను మర్చిపోయి మీరూ, కామేశ్వరీ హాయిగా వుండండి" అంటూ ఏడిచింది. కాళ్ళు వదలలేదు.

"ఆ సంగతి నువ్వు చెప్పక్కర్లేదు. నాకు తెలుసు—ఇంక నేను పొరపాటు చేస్తానా. నా కామేశ్వరిని పువ్వుల్లో పెట్టి కాపాడుకోనూ—వదులు ముందు—ఛీ—" అంటూ విదిలించుకోబోయాడు. అర్ధ మూర్ఛావస్థలో అలాగేవుండిపోయిందామె.

"చెప్తుంటే—నీక్కాదూ!" అంటూ ఒక్క నెట్టు నెట్టా డతను. వెళ్లి గడప మీద పడింది శ్యామల "అమ్మా!" అని అరుస్తూ—

* *

ఏమిటక్కా! పరుపుమీదనించీ కింద పడ్డావా? అయ్యో—ఏమిటింకా కలవ

యువ

రిస్తున్నావు? అమ్మకోసమా? సినిమానించి వచ్చాకకూడా ఆవిడను చూసావుగదమ్మా పదిన్నరకి ఇప్పుడు టైము మూడైందేమో—ఇంతలోనే విరహమా అమ్మ కూఛీ ఇంతసేపు అమ్మను చూడకుండా వుండలేని పెద్దమనిషివి రేపు పెళ్లి ఎలా చేసుకుంటున్నావ్? కాస్త చెప్పమ్మా! బావగారి దగ్గిర కూర్చుని 'ఊఁ అమ్మ కావాలీ అని ఎడుస్తావా? ఎగతాళిగా అంటూ శ్యామల భుజాలు పట్టుకుని కుదిపింది కామేశ్వరి

గభుక్కున కళ్లు తెరిచింది శ్యామల ఎదురుగా కామేశ్వరి అప్పుడే వచ్చేశావా? అన్నది ఆదుర్దాగా

నే నెక్కడికి పోయా నక్కా—రావడానికి? ఎద్దూరంగా అడిగింది కామేశ్వరి

కళ్లుబాగా తెరిచి లేచికూచుని మెళ్ళో వున్న ఒంటిపేట గొలుసువేపు చూసింది శ్యామల

"ఏమిటక్కా!' చిత్రంగా అడిగింది కామేశ్వరి

' అదికాదు—మంగళసూత్రాలు

"మంగళ సూత్రాలా? భలేదానివే కలలో చేసుకున్నావా పెళ్ళి? ప్చ్—పాపం—తొందరపడకు మరి ఆ ముహూర్తమూ త్వరలో వచ్చేస్తోందిగా అంటూ నవ్వింది కామేశ్వరి

ఆనందాతిశయంతో ఒక్కసారి వెలిగిపోయింది శ్యామల మొహం కామేశ్వరి భుజాలుపట్టుకుని దగ్గిరికి మరీ దగ్గిరికి లాక్కుని నిజంగానా? చెల్లీ! నాకింకా పెళ్లి కాలేదా? ఎంత అదృష్టం—'"
అంటూ కౌగిలించుకుంది

ఏమిటిది? నే నమ్మా కామేశ్వరిని—కాబోయే బావగార్నికాదు కొంటెగా అన్నదా పిల్ల

ఊరుకో—నే నతన్ని పెళ్లిచేసుకోబోవటల్లేదు బాబోయ్—అజన్మ బ్రహ్మచారిణిగా నైనా వుంటాను గానీ ఇలాంటి వాడిని పెళ్లిచేసుకుని—తర్వాత ఆ మానసిక వాంఛ నేనుపడలేను అంతత్యాగం ఊహించుకోవటానికి బాగానే వుంటుంది. కానీ అమ్మో నిజజీవితంలోనే—నావల్ల కాదు పతిదానం నేను చెయ్యలేను నేనే కాదు ఏఆడదీ చెయ్యలేదు అంతకంటే ఈ బతుకే నాకు హాయి రేపొద్దున్నే నాన్నకు చెప్పెయ్యాలి ఈ పెళ్ళివద్దని

శ్యామల మాటలను నోరు తెరుచుకుని వింటోంది కామేశ్వరి

తర్వాత ఆశ్చర్యం నటిద్దువుగాని ముందు నీసంగతి చెప్పు నువ్వు పీయూసీ అయ్యాక ఏం చేస్తావు? బియ్యే చదువుతావా? అని అడిగింది శ్యామల

చదవనను కుంటాను—అయన—అబ్బ—అదే నక్కా మీ మరదిగారు నాన్నకు ఉత్తరం రాశారు తొందర్లోవచ్చి నన్ను తీసుకువెళ్తానని—నిన్ను విడిచి అంతదూరం వెళ్లాలిగదా అని ఏడుపొచ్చింది ఇందాక అని సిగ్గుపడుతూ శ్యామల ఒళ్ళో తలదాచుకున్నది కామేశ్వరి